క్లుప్తంగా

విద్యార్థులకు పరామర్శ


విద్యార్థులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ నర్తు రామారావు

ఇచ్ఛాపురం: ఒడిశాలోని సుమండి గ్రామం వద్ద ఎం.తోటూరులోని ప్రైవేటు పాఠశాల బస్సు సోమవారం బోల్తాపడింది. దీంతో అందులో ఉన్న విద్యార్థులకు స్వల్ప గాయాలయ్యాయి. వీరిని పట్టణంలోని ఒక ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించి చికిత్స అందించారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ నర్తు రామారావు, మున్సిపల్ చైర్‌పర్సన్ పిలక రాజలక్ష్మి, వైస్ చైర్‌పర్సన్ ఉలాల భారతిదివ్య విద్యార్థులను పరామర్శించారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు ప్రకాశరావు పట్నాయక్ వైఎస్సార్‌సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

తిలక్ పరామర్శ


వేణును పరామర్శిస్తున్న పేరాడ తిలక్

కాశీబుగ్గ: పలాస మండల వ్యవసాయ బోర్డు మాజీ చైర్మన్ గొర్ల వేణు తల్లి పద్మావతి ఇటీవల మృతి చెందారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్ సీపీ పార్లమెంటరీ ఇన్‌చార్జి పేరాడ తిలక్ సోమవారం రాజగోపాలపురంలోని వేణు కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో నందిగాం ఎంపీపీ నడుపూరి శ్రీరామమూర్తి, పలాస పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు చింతాడ మాధవరావు, నందిగాం మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితుడు చిన్ని జోగారావు, కవిటి అగ్రహారం సర్పంచ్ ప్రతినిధి బొమ్మాళి గున్నయ్య, పెద్దనారాయణపురం సర్పంచ్ పిట్ట షణ్ముఖరావు పాల్గొన్నారు.

పెండింగ్ సమస్యలపై దృష్టి పెట్టాలి


తహసీల్దార్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న నాయకులు

ఇచ్ఛాపురం రూరల్: మండల తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించిన ఎస్.వెంకటరావును సోమవారం మండల వైఎస్సార్‌సీపీ నాయకులు మర్యాద పూర్వకంగా కలిసి పుష్ప గుచ్ఛం అందజేశారు. పెండింగ్‌లో ఉన్న మ్యుటేషన్స్, వివిధ ధ్రువపత్రాలపై దృష్టి సారించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు పిట్ట మామయ్యరెడ్డి, నీలాపు చంద్రయ్యరెడ్డి, లోపింటి దుర్యోధన పాల్గొరు.

నౌపడలో కంటి వైద్య శిబిరం


శస్త్రచికిత్సకు ఎంపికైన వారితో నిర్వాహకులు

సంతబొమ్మాళి: నారాయణ కమలం శ్రేయోనిధి ఆధ్వర్యంలో శంకర్ ఫౌండేషన్ సౌజన్యంతో నౌపడలో సోమవారం కంటి వైద్య శిబిరం నిర్వహించారు. 119 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి 35 మందిని శస్త్రచికిత్సకు ఎంపిక చేశారు. కార్యక్రమంలో నౌపడ పీహెచ్‌సీ డాక్టర్ పరిమళ నందిని, పారామెడికల్ ఆప్తాలమిక్ ఆఫీసర్ ఎం.ఆర్.కె.దాస్, సీపీ రాజా, ఎల్.జయకృష్ణరెడ్డి పాల్గొన్నారు.

కవిటి కళాశాలలో స్వచ్ఛభారత్


పిచ్చిమొక్కలు తొలగిస్తున్న విద్యార్థులు

కవిటి: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం విద్యార్థులు స్వచ్ఛభారత్ నిర్వహించారు. ప్రిన్సిపాల్ పి.రాజేశ్వరరావు, అధ్యాపక సిబ్బంది సమక్షంలో చెత్తాచెదారాలు, పిచ్చిమొక్కలు తొలగించి పరిసరాలను శుభ్రం చేశారు.

మత్స్యకారుని కుటుంబానికి సాయం


కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న భాస్కరరావు

వజ్రపుకొత్తూరు: గోవాలో చేపల వేటకు వెళ్లి ప్రమా దవశాత్తు మృతి చెందిన కొమర ఎర్రన్న కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని వైఎస్సార్‌సీపీ అధికార ప్రతినిధి, పల్లివూరు సర్పంచ్ మామిడి భాస్కరరావు కోరారు. సోమవారం యర్రన్న కుటుంబాన్ని హకుంపేటలో పరామర్శించి నగదు, బియ్యం, నిత్యావసర సరుకులు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఎర్రన్న కుటుంబానికి రూ.10లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఎం.ధనుంజయం, ఎ.లింగరాజు, ఎస్.ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

ఆపదలో అండగా..


ఎస్‌జీఎఫ్ స్వచ్ఛంద సంస్థ చేపడుతున్న సేవా కార్యక్రమాలు ప్రశంసనీయమైనవని ఏఎంసీ మాజీ చైర్మన్ పండి దేవేంద్రమూర్తి, బెంతొ ఒడియా సంఘం నేత మోహన్ సాహూ అన్నారు. వడ్డిజల్లుపుట్టుగలో కిడ్నీ బాధితుడు గణపతి మజ్జి దీనస్థితిని తెలుసుకున్న సంస్థ సభ్యులు సోమవారం రూ.10,000 నగదు అందజేశారు.
– కవిటి

అధిక దిగుబడులకు ఇదీ 'వరుస'


వరుస క్రమంలో నాట్లు వేసే పద్ధతిపై రైతులకు అవగాహన కలిగేలా సోమవారం టెక్కలి మండలం గూడెం గ్రామ పరిధిలోని వరి పొలాల్లో 'పొలం బడి' నిర్వహించారు. ఈ విధానంలో సాగు చేస్తే గాలి, వెలుతురు సక్రమంగా అందడమే కాకుండా చీడ పీడల ప్రభావం ఉండదని చెప్పారు. వ్యవసాయ శాఖ ఏడీ జి.వి.తిరుమలరావు, ఏఓ జి.రంగారావు, విస్తరణాధికారులు ఎల్.నరేంద్రం, బి.జనార్దన్ పాల్గొన్నారు.
– టెక్కలి

గట్టు వేస్తేనే గట్టెక్కేది..!


బహుదా నది నీటిని పంట పొలాలకు మళ్లించేందుకు ఇచ్ఛాపురం మండలం కేశుపురం, బూర్జపాడు, డొంకూరు ప్రాంతాల రైతులకు తీవ్రంగా శ్రమిస్తున్నారు. ఈదుపురం వద్ద నదిలో నిర్మించిన కేశుపురం గ్రోయిన్ పక్క నుంచి సాగునీరు సముద్రంలో కలిసి పోతుండటంతో బూర్జపాడు రైతులు సోమవారం ఇసుకను బస్తాల్లో నింపి గ్రోయిన్‌కు ఆనుకొని అమర్చి సాగునీటిని పంట పొలాల వైపు మళ్లించారు.
– ఇచ్ఛాపురం రూరల్

అరకొర సిబ్బందితో అవస్థలు

- విద్యుత్ శాఖలో క్షేత్రస్థాయి సిబ్బంది కొరత
- ప్రస్తుత స్టాఫ్‌పై అదనపు పనిభారం
- సకాలంలో పరిష్కారం కాని సమస్యలు

టెక్కలి :

టెక్కలి డివిజన్ విద్యుత్ శాఖ కార్యాలయం పరిధిలో క్షేత్ర స్థాయిలో విద్యుత్ సిబ్బంది కొరత తీవ్రంగా వేధిస్తోంది. దీంతో అత్యవసర సమయాల్లో అరకొర సిబ్బందిపైనే అదనపు పనిభారం పడుతోంది. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో తరచూ విద్యుత్ సమస్యలు తలెత్తుతున్నాయి. పూర్తి స్థాయిలో లైన్‌మేన్, అసిస్టెంట్ లైన్‌మేన్, జేఎల్‌ఎం (ఎనర్జీ అసిస్టెంట్)లు లేకపోవడంతో ఉన్న కొద్ది పాటి సిబ్బందితోనే విద్యుత్ మరమ్మతులు చేపడుతున్నారు. ఈ క్రమంలో కొన్ని సందర్భాల్లో సమస్య పరిష్కారంలో జాప్యం ఏర్పడుతోంది.

- టెక్కలి, సంతబొమ్మాళి, కోటబొమ్మాళి, నందిగాం మండలాల పరిధిలో సుమారు 1,00,329 విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. పూర్తిస్థాయిలో క్షేత్ర స్థాయి సిబ్బంది లేకపోవడంతో వినియోగదారులకు అవస్థలు తప్పడం లేదు.
- టెక్కలి మండలంలో 32,500 విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. టౌన్ పరిధిలో ఇద్దరు లైన్‌మేన్లు, ఇద్దరు సహాయ లైన్‌మేన్లు, ఐదుగురు జేఎల్‌ఎంలు ఉండాలి. ప్రస్తుతం ఇద్దరు మాత్రమే ఉన్నారు. గ్రామీణ ప్రాంతాల పరిధిలో తలగాం, బొప్పాయిపురం, నరసింగపల్లి, బూరగాం, లింగాలవలస సచివాలయాల పరిధిలో జేఎల్‌ఎంలు లేకపోవడంతో స్థానికులకు అవస్థలు తప్పడం లేదు. వాస్తవానికి 12 వేలు కనెక్షన్లు దాటితే ఇద్దరు ఏఈలు ఉండాలి. ఇక్కడ ఒక్కరు మాత్రమే ఉన్నారు.
- సంతబొమ్మాళి మండలంలో 24 వేల విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. ఇక్కడ ముగ్గురు సహాయ లైన్‌మేన్లు, ఐదుగురు జెఎల్‌ఎం పోస్టులు ఖాళీగా ఉన్నాయి.
- కోటబొమ్మాళి మండలం పరిధిలో 24,612 విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. కోటబొమ్మాళి టౌన్, తిలారులో సహాయ లైన్‌మేన్ పోష్టులు ఖాళీగా ఉన్నాయి. ఊడికలపాడు, చిట్టివలస గ్రామాల్లో జెఎల్‌ఎం (ఎనర్జీ అసిస్టెంట్) పోస్టులు భర్తీ చేయాల్సి ఉంది.


టెక్కలి పరిధిలో విద్యుత్ మరమ్మతులు చేస్తున్న క్షేత్ర స్థాయి సిబ్బంది

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లాం..



టెక్కలి డివిజన్ విద్యుత్ శాఖా కార్యాలయం పరిధిలో క్షేత్ర స్థాయి సిబ్బంది కొరతపై ఇప్పటికే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లాం.ప్రతి నెలవారీ సమీక్షలో సమస్యను ప్రస్తావిస్తున్నాం.
– జి.శంకరరావు, డీఈఈ, విద్యుత్ శాఖ, టెక్కలి

వితంతు పింఛన్లకు దరఖాస్తు చేసుకోండి


మాట్లాడుతున్న పలాస జూనియర్ సివిల్ జడ్జి యు.మాధురి

పలాస: అర్హులైన ప్రతి ఒక్కరికీ వితంతు పింఛను అందుతుందని, మళ్లీ కొత్తగా దరఖాస్తులు చేసుకోవాలని పలాస జూనియర్ సివిల్ జడ్జి యు.మాధురి భరోసా ఇచ్చారు. పలాస నియోజకవర్గంలోని పలాస మండలంలో 76 మంది, వజ్రపుకొత్తూరు మండలంలో 57 మంది వితంతువులు ఆరు నెలలుగా పింఛన్ల కోసం ఎదురు చూస్తున్నారు. వీరి కోసం పలాస మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం రాష్ట్ర హైకోర్టు చీఫ్ జస్టిస్, ఎ.పి స్టేట్ లీగల్ సర్వీస్ అథారిటీ చైర్మన్ ఆదేశాల మేరకు పలాస మండల లీగల్ సర్వీస్ అథారిటీ చైర్మన్, పలాస జూనియర్ సివిల్ జడ్జి యు.మాధురి ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా అర్హులైన వితంతువులు హాజరై తమ గోడు వెల్లబుచ్చారు. అనంతగిరి పంచాయతీ బెండిగేటుకు చెందిన సల్ల మహాలక్ష్మి మాట్లాడుతూ తన భర్త చనిపోయిన వెంటనే పింఛన్ కోసం దరఖాస్తు చేసుకున్నానని, అయినా ఇంతవరకు మంజూరు కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. చినబాడాంకు చెందిన న్యాయవాది కోత రజనీకాంత్ మాట్లాడుతూ పింఛన్లు అందని వితంతవులు వెంటనే దరఖాస్తు చేసుకోవాలని, కోర్టు ద్వారా న్యాయం చేస్తామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో పలాస, వజ్రపుకొత్తూరు మండల ఎంపీడీఓలు మెట్ట వైకుంఠరావు, డి.తిరుమల, బార్ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ జి.ఎం.ఎస్ అనిల్‌రాజు, సీనియర్ న్యాయవాది బి.కె.ఆర్.పట్నాయక్, కోత రజనీకుమార్, జి.ప్రభాకర్, చిట్టిబాబు, కె.దేవరాజు, ఉషారాణి, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

గిరిజన ప్రాంతాల అభివృద్ధికి కృషి


శిలా ఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే శిరీష

కాశీబుగ్గ: గిరిజన ప్రాంతాల అభివృద్ధికి కృషి చేయడమే కూటమి ప్రభుత్వం ప్రధాన లక్ష్యమని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. మందస మండలం సాబకోట పంచాయతీ బల్యాసాయి గ్రామంలో రూ.40 లక్షల నిధులతో నిర్మించనున్న రోడ్డు పనులకు సోమవారం శంకుస్థాపన చేశారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మౌలిక వసతులు కల్పనకు కృషి చేస్తానని చెప్పారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ దాసరి తాతారావు, నాయకులు భావన దుర్యోధన, రట్టి లింగరాజు, లబ్బ రుద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

వంశధార జలాలను బహుదానదికి మళ్లించాలి


ఎమ్మెల్యే అశోక్‌కు వినతిపత్రం అందిస్తున్న కిరణ్‌కుమార్

ఇచ్ఛాపురం రూరల్: ఇచ్ఛాపురం నియోజకవర్గంలోని రైతులు కేవలం వర్షాధారంపై ఆధారపడుతూ పంటలు పండిస్తున్నారని, వంశధార నదీ జలాలను బహుదానదికు మళ్లించి దుకోవాలని ఉద్దానం యువజన జేఏసీ అధ్యక్షుడు డాక్టర్ పూడి కిరణ్‌కుమార్ కోరారు. ఈ మేరకు సోమవారం ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బెందాళం అశోక్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఇచ్ఛాపురం రైల్వే ఉత్తర క్యాబిన్ వద్ద వంతెన, ఉద్దానం ప్రాంతంలో కోకోనట్ పార్క్, కవిటి మండల కేంద్రంలో డిగ్రీ కళాశాల నిర్మించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

అక్రమ రవాణాను అరికడదాం

ఇచ్ఛాపురం రూరల్: అనుమతి లేకుండా ఇసుక, కంకర, రాళ్లు వంటివి అక్రమంగా రవాణా కాకుండా అడ్డుకోవాలని తహసీల్దార్ ఎస్.వెంకటరావు అన్నారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్‌ఓలు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలం, మున్సిపాలిటీ పరిధుల్లో ఇసుక రీచ్‌లు లేవని, గృహ నిర్మాణాలకు మాత్రమే ఇసుక తీసుకోవాలని, అలా కాదని వ్యాపారం చేసేందుకు ఇసుక, మట్టిని తరలిస్తే కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. విద్యార్థులకు కుల, ఆదాయ, నివాస ధ్రువపత్రాలు గడువులోగా జారీ చేయాలన్నారు. సమావేశంలో ఉప తహసీల్దార్ సదాశివుని గురుప్రసాద్, మండల సర్వేయర్ తవిటినాయుడు పాల్గొన్నారు.

జాతీయస్థాయి పోటీలకు రామ్మోహన్‌రావు


గురుగుబెల్లి రామ్మోహనరావు

కాశీబుగ్గ: పలాస ఆర్టీసీ డిపో రక్షణ విభాగంలో పనిచేస్తున్న గురుగుబెల్లి రామ్మోహన్‌రావు అఖిల భారత ప్రజా రవాణా సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆల్‌ఇండియా అథ్లెటిక్స్ పోటీల్లో ఫాస్ట్ వాక్ పోటీల్లో రాష్ట్ర స్థాయిలో రెండో స్థానంలో నిలిచారు. విశాఖపట్నం కైలాసగిరి క్రీడా మైదానంలో జూలై 14న జరిగిన జోన్‌స్థాయి పోటీల్లో రెండు విభాగాల్లో ద్వితీయ స్థానం సాధించారు. అనంతరం ఆగస్టు 3న గుంటూరు ఆచార్య నాగార్జున యూనివర్సిటీ క్రీడా మైదానంలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో ద్వితీయ స్థానం సాధించారు. దీంతో సెప్టెంబర్ జరగబోయే జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా రామ్మోహనరావును పలాస ఆర్టీసీ డిపో మేనేజర్ ఆర్.సీతారాంనాయుడు, అసిస్టెంట్ మేనేజర్ పినకాన సంతోష్‌కుమార్, యూనియన్ నాయకులు సోమవారం అభినందించారు.

నేడు హుండీ కానుకల లెక్కింపు

టెక్కలి: టెక్కలి మండలం రావివలస ఎండల మల్లికార్జునస్వామి ఆలయంలో మంగళవారం ఉదయం 10 గంటలకు హుండీకానుకల ఆదాయం లెక్కిస్తున్నట్లు ఆలయ కార్య నిర్వాహణాధికారి వి.రాధాకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక సంతోషిమాత ఆలయంలోని హుండీని మధ్యాహ్నం 3 గంటలకు తెరిచి లెక్కిస్తామని కార్యనిర్వాహణాధికారి టి.పి.మనస్వి తెలిపారు. అధికారులు, అర్చకులు, సిబ్బంది సమక్షంలో లెక్కింపు జరుగుతుందని పేర్కొన్నారు.

దివ్యాంగుల హక్కులపై అవగాహన


మాట్లాడుతున్న జూనియర్ సివిల్ జడ్జి తేజ చక్రవర్తి

టెక్కలి: మానసిక దివ్యాంగుల హక్కులకు ఎవరైనా భంగం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని టెక్కలి జూనియర్ సివిల్ జడ్జి ఎస్‌హెచ్‌ఆర్.తేజ చక్రవర్తి మల్ల అన్నారు. మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో మానసిక దివ్యాంగుల హక్కులు, వారికి అందజేస్తున్న పథకాలపై సోమవారం టెక్కలి భవిత కేంద్రంలో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు డి.వివేకానంద, మండల విద్యా శాఖాధికారులు డి.తులసీరెడ్డి, డి.చిన్నారావు, భవిత కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాసేవే లక్ష్యం

కవిటి: మండలంలోని జగతిలో సోమవారం రిటైర్డ్ డీఎస్పీ శమళ్ల వెంకట వరప్రసాదరావు జనసేన పార్టీ సభ్యత్వాన్ని స్వీకరించారు. ప్రజాసేవ చేసేందుకే పార్టీలో చేరుతున్నట్లు ప్రకటించారు. కార్యక్రమంలో ఇచ్ఛాపురం నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి దాసరి రాజు తదితరులు పాల్గొన్నారు.

ఈ-పంట నమోదు తప్పనిసరి


అవహన కల్పిస్తున్న ఉపసంచాలకుడు త్రినాథ్

సోంపేట: రైతులు సాగు చేస్తున్న పంటలకు ప్రభుత్వ పథకాలు వర్తించాలంటే ఈ-పంట నమోదు తప్పనిసరిగా చేయించాలని శ్రీకాకుళం వ్యవసాయ వనరుల కేంద్రం వ్యవసాయ ఉప సంచాలకుడు కె.త్రినాథ్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం సోంపేట డివిజన్ పరిధిలోని నాలుగు మండలాల వ్యవసాయ సిబ్బందికి ఈ-పంట, ఇండి గ్యాప్ పొలంబడిపై వ్యవసాయ సహాయ సంచాలకుడు కె.జగన్మోహనరావు ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా త్రినాథ్ మాట్లాడుతూ వ్యవసాయ సహాయకులు సర్వే నెంబర్, సాగునీటి వసతి, పంటల రకం, సాగుదారు యజమానులు, అనుభవదారులు, కౌలుదారుల వారీగా వివరాలు నమోదు చేయాలని సూచించారు. పొలంబడిని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారులు బి.నర్సింహమూర్తి, కె.తిలక్, టి.భార్గవి, ఆర్బీ సీఈఓ ప్రియాంక, ప్రకృతి వ్యవసాయం, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

అబ్బురపరిచిన గణిత దశావధానం


గణిత దశావధానం నిర్వహిస్తున్న తిరుపతిరావు

సోంపేట: అంతర్జాతీయ గణిత దినోత్సవం సందర్భంగా మామిడిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో పలాసకు చెందిన జనజాగృతి సాహితీ సాంస్కృతిక సమాఖ్య సౌజన్యంతో నిర్వహించిన గణిత దశావధానం కార్యక్రమం ఆకటుకుంది. గణిత అవధాని మద్దు తిరుపతిరావు పది మంది అడిగిన ప్రశ్నలను క్షణాల్లో సమాధానం చెప్పి అబ్బుర పరిచారు. భయం వీడితే గణితం సులభంగా నేర్చుకోవచ్చని చెప్పారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రోణంకి అనంతరావు, సమాఖ్య ప్రతినిధులు కుమార్‌నాయక్, శ్రీనివాస బాబ్జి, తెప్పల కృష్ణమూర్తి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ


మొక్కలు నాటుతున్న డీఎస్పీ నాగేశ్వరరెడ్డి, లయన్స్ క్లబ్ ప్రతినిధులు

కాశీబుగ్గ: మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమవుతుందని డీఎస్పీ నాగేశ్వరరెడ్డి అన్నారు. పలాసలోని లయన్స్ క్లబ్ ఆఫ్ పలాస కాష్యూ ల్యాండ్ నవిత క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం మొక్కలు నాటారు. కార్యక్రమంలోలయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ ఎస్‌వీబీఎస్ఎస్ ప్రసాద్, వైస్ ప్రెసిడెంట్ సూర్యప్రకాష్, రీజనల్ చైర్మన్ రంగనాథ్, జోన్ చైర్మన్ రవి, కాశీబుగ్గ ఎస్ఐ పారినాయుడు, 'వనిత' అధ్యక్షురాలు తర్లానా శ్వేతకుమారి, కార్యదర్శి మల్లా సంతోషి, కోశాధికారి తూముల గాయత్రి, పూర్వ అధ్యక్షురాలు మల్లా జయశ్రీ, ఉపాధ్యక్షురాలు పెంట జగదీశ్వరి, సహాయ కార్యదర్శి జ్యోత, సభ్యులు తులసి తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాలతో సంపూర్ణ ఆరోగ్యం

ఇచ్ఛాపురం రూరల్: తల్లిపాలతోనే బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఇచ్ఛాపురం ఎంపీపీ బోర పుష్ప అన్నారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా సోమవారం కె.శాసనాం, బొడ్డబడ, కీర్తిపురం, కొళిగాం, పాయితారి, మశాఖపురం, ఇన్నేసుపేట అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులకు, బాలింతలకు వైద్య బృందం అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీడీపీఓ పి.నాగరాణి, మాజీ ఎంపీపీ కారంగి మోహనరావు, సర్పంచ్ కారంగి త్రినాథ్‌రెడ్డి, తిప్పన దుర్యోధనరెడ్డి, సూపర్‌వైజర్లు నీలవేణి, పుష్పలత పాల్గొన్నారు.

కాశీబుగ్గ: పలాస మండలం బొడ్డపాడు పంచాయతీ అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాలు వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ చెరుకుపల్లి దానమ్మ, మహిళా పోలీసు డి.ఊహ, హెల్త్ డిపార్ట్‌మెంట్ పావని, ఆశవర్కర్లు అన్నపూర్ణ, శారద, అరుణ, ప్రియ, మీనాక్షి, రోజా, దివ్య, దమయంతి పాల్గొన్నారు.


ఇచ్ఛాపురం రూరల్: కె.శాసనాంలో పౌష్టికాహారం అందజేస్తున్న ఎంపీపీ బోర పుష్ప

కాశీబుగ్గ: మున్సిపాలిటీ పరిధిలోని 5వ వార్డు, 3వ వార్డు పరిధిలో తాళభద్ర, జయరామచంద్రపురం, పెంటిభద్ర, తాళబద్ర-2 అంగన్‌వాడీ కేంద్రాల్లో తల్లిపాల వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో సిబ్బంది ఎన్.శైలజ, ఆర్.కృష్ణవేణి, శాంతి, రమ పాల్గొన్నారు.

నందిగాం: బిడ్డకు తల్లి పాలే అమృతమని చైల్డ్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టు అధికారి శోభారాణి అన్నారు. దేవళభద్రలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జలజాక్షి, పీహెచ్ఎన్ నాగమణి, అంగన్‌వాడీ కార్యకర్త మంజు భార్గవి పాల్గొన్నారు. నందిగాం సెక్టార్-2 పరిధిలోని హరిదాసుపురంలో నిర్వహించిన తల్లిపాల వారోత్సవాల్లో సూపర్‌వైజర్ శారదాబాయి పాల్గొన్నారు.


కాశీబుగ్గ : బొడ్డపాడులో తల్లిపాల వారోత్సవాల ర్యాలీ


నందిగాం: దేవళభద్ర కేంద్రంలో మాట్లాడుతున్న సీడీపీఓ శోభారాణి


కాశీబుగ్గ: తాళభద్ర అంగన్‌వాడీ కేంద్రంలో సీమంతం

రుద్రమూర్తికి కళాశ్రీ పురస్కారం

కాశీబుగ్గ: నటుడు, దర్శకుడు, ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర ప్రవాసాంధ్ర తెలుగు మహాసభ నిర్మాత లండ రుద్రమూర్తి టీవీ కళాశ్రీ పురస్కారానికి ఎంపికయ్యారు. వజ్రపుకొత్తూరు మండలం కంబాలరాయుడుపేటకు చెందిన రుద్రమూర్తికి ఈ నెల 15న గుంటూరులో పురస్కారం అందిస్తామని సంస్థ చైర్మన్ చిట్టినేని లక్ష్మినారాయణ ప్రకటించారు.